క్లుప్తంగా

చిన్న చెరువుకు జలకళ



నిండుకుండలా కనిపిస్తున్న ఉరవకొండలోని చిన్నచెరువు

ఉరవకొండ: పట్టణంలోని బీబీ జైనబ్బీ దర్గా వద్ద ఉన్న చిన్నచెరువు వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీటితో నిండుకుండను తలపిస్తోంది. గతంలో చెరువు ఎండిపోవడంతో చుట్టుపక్కల పొలాలకు నీరు అందక రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలకు చెరువులోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో పాటు భూగర్భజలాలు పెరిగి, రైతులకు సమృద్ధిగా నీరు అందుతుంది.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు



పూజలందుకున్న దశభుజ మహా గణపతి

రాయదుర్గం టౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహా గణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు చేస్తారు. స్వామి దర్శనం కోసం స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై, మొక్కులు తీర్చుకున్నారు.

మూగజీవాలకు తీరిన గ్రాసం కొరత



చిన్నముష్టూరు సమీపంలోని హంద్రీనీవా కాలవ వద్ద మేత మేస్తున్న గొర్రెలు

ఉరవకొండ: ఉరవకొండ మండల వ్యాప్తంగా నైరుతి రుతుపవనాల ప్రభావంతో గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు బైలు మైదానాల్లో పచ్చిగడ్డి పెరిగింది. దీంతో మూగజీవాలకు గ్రాసం కొరత తీరింది. వివిధ ప్రాంతాల నుంచి గొర్రెలు, మేకలను మేత కోసం వచ్చే కాపరులకు ఉరవకొండ సమీపంలో హంద్రీనీవా కాలువలో తగినంత నీరు, మేత లభ్యం అవుతోంది. దీంతో గొర్రెల కాపరులు ఇతర ప్రాంతాల నుంచి కూడా మేత కోసం జీవాల మందలను తీసుకొస్తున్నారు.

ప్రధాన రహదారిపైనే మురుగునీరు



కూడేరులోని ట్రాన్స్‌కో కార్యాలయం- స్టేట్ బ్యాంక్ మధ్యలో రహదారిపై ఇలా..

కూడేరు: మండల కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయం – స్టేట్ బ్యాంక్ మధ్యలో అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపైకి మురుగు నీరు చేరింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారికిరువైపులా డ్రైనేజీలు ఏర్పాటు చేశారు. 20 రోజులుగా ఆర్టీటీ ఫీల్డ్ ఆఫీస్ వైపు ఉన్న డ్రైనేజీ నుంచి మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. స్థానికులు మురుగు నీటి నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు వాహనాలు వెళ్లినప్పుడు మురుగు నీరు పాదచారులు, ఇళ్లు, దుకాణాలపై పడుతోంది.

నగరవనం అభివృద్ధికి చర్యలు

- ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



నగర వనంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గంలో ఫారెస్ట్ ఆధీనంలో ఉన్న నగరవనం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. ఆదివారం ఉదయం ఆయన ఫారెస్ట్ అధికారులతో కలిసి నగరవనం ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా నగరవనంలో ప్రజలకు ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం చిన్నారులకు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన పలు పరికరాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులతో నగరవనాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పెంచేలా ప్రత్యేక చొరవ చూపాలని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మధుబాబుకు ఎమ్మెల్యే సూచించారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో డీఎస్సీ అభ్యర్థులకు ప్రత్యేక కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జగన్నాథం, బీట్ ఆఫీసర్ నాగేనాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వామ్మో..ధరల దడ

- దిగిరాని కూరగాయల ధరలు
- జేబు ఖాళీ అయినా.. సంచి నిండలే..
- పది రోజుల్లోనే అమాంతంగా పెరుగుదల



కూడేరులోని ఓ దుకాణంలో అమ్మకానికి ఉంచిన కూరగాయలు

రాయదుర్గం/కూడేరు: ' ఏం జానకీ.. ఏమి వంట చేసావ్..అంటూ పొరుగింటి రంగమ్మ పలకరించింది.. ఏం వంట చేయను రంగమ్మ అత్తా.. కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కొనాలంటే అగ్గి పడుతోంది'... అంటూ నిట్టూర్చింది జానకి. గ్రామాలు, పట్టణాల్లో ఏ ఇద్దరు, ముగ్గురు మహిళలు కలిసినా..ఇదే కూరగాయాల ధరల ముచ్చటే. రోజురోజుకూ మార్కెట్‌లో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి. దీనికితోడు ధరలు పెరగడంతో పెట్టుబడి పెరిగిందని, కొనుగోలు తగ్గిందని వ్యాపారులూ ఆవేదన చెందుతున్నారు. రుచికరమైన కూరలు వండలేకపోయినా, కనీసం టమాట, పచ్చి మిర్చితో చట్నీ అయినా చేసుకొని పూట గడుపుకుందామంటే వీటి ధరలూ పైపైకి పోతున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ సీజన్. పంటల సాగు, పొలం పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పొలం వద్దకు అన్నం తీసుకెళ్లాలంటే ఏం కూర వండాలో.. మార్కెట్లో ఏం కూరగాయలు కొనాలో దిక్కుతోచక మహిళలు అయోమయ పరిస్థితిలో ఉన్నారు.



రాయదుర్గంలోని బళ్లారి రోడ్డులో నిర్వహిస్తున్న వారపు సంత

ధరలు దిగిరావడంలేదు..

కొండెక్కిన కూరగాయల ధరలు దిగిరావడం లేదు. ఏం కొనాలో..? ఏం తినాలో..? అర్థం కాక వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. మార్కెట్‌తో పాటు రైతు బజారులోనూ టమాట, మిర్చి, బీన్స్, క్యాప్సికం, ఉల్లి, చిక్కుడు, బెండ, బీర ఇలా ఏ రకం కూరగాయలు కొనాలన్నా ధరలు దడపుట్టిస్తున్నాయి. సాధరణంగా జూన్ మాసం అంటేనే ఖరీఫ్ సీజన్ ఆరంభం. రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యే కాలం. తెల్లారక ముందే క్యారీలు (అన్నంబాక్సులు)సిద్ధం చేసుకొని, కాడెద్దుల కాడెకు తగిలించుకొని వెళ్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో కూరగాయల ధరలు ఆకాశన్నంటడం ఆందోళన కలిగించే విషయం. ఈ సీజన్‌లో ఎన్నడూ లేని విధంగా టమాటా కిలో రూ.60కి పెరిగింది. నెల క్రితం వరకు రూ.30 నుంచి రూ.40 లోపు ఉండేది. అంతకు ముందు అయితే కేవలం రూ.20 కే కిలో అమ్ముడుపోయింది. ప్రస్తుతం రెట్టింపు ధరకు చేరుకుంది.

వేసవి ప్రభావం

వేసవి కారణంగా దిగుబడులు తగ్గిపోవటంతో ధరలపై కొంత ప్రభావం చూపింది. రాయదుర్గం కూరగాయల మార్కెట్‌కు చుట్టు పక్కల పల్లెలతో పాటు బెంగళూరు నుంచి ఆశించిన స్థాయిలో రావాల్సిన సరుకు రవాణా తగ్గింది. ఈ నేపథ్యంలో కూరగాయాల ధరలు అమాంతం పెరిగేందుకు కారణమైందని వ్యాపారులు చెపుతున్నారు. కొన్ని చోట్ల వర్షాలు ఎక్కువై పంటలు దెబ్బతిన్నాయి.

ఆకుకూరలూ పిరమే..

గడిచిన కొద్ది రోజుల క్రితం రూ.10 కి రెండు కట్టల చొప్పున ఆకు కూరలు విక్రయించేవారు. ప్రస్తుతం రూ.20కి రెండు లేదా మూడు కట్టలు మాత్రమే ఇస్తున్నారు. కొత్తిమీర కట్ట ధర రూ.20 నుంచి రూ.25 కు చేరుకుంది. రైతుల వద్ద అయితే రూ.15 నుంచి రూ.20కి లభిస్తోంది. గతంలో వందల కట్టలు విక్రయించే వ్యాపారులు పదుల సంఖ్యలో అమ్మకం చేపట్టలేక పోతున్నామని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల ధరలు కూడేరులో ఇలా..

కూరగాయల పేరు	కిలో ధర
బీన్స్	రూ.150
టమాట	రూ.80
బీరకాయ	రూ.80
కాకరకాయ	రూ.80
క్యారెట్	రూ.80
పచ్చిమిర్చి	రూ.70
ముల్లంగి	రూ.60
ఉర్లగడ్డ	రూ.50
ఉల్లిగడ్డ	రూ.50
క్యాబేజీ	రూ.40
బెండకాయ	రూ.40
వంకాయలు	రూ.50

రాయదుర్గంలో కూరగాయల ధరలు ఇలా

కూరగాయల పేరు	కిలో ధర
టమాట	రూ.60
పచ్చిమిర్చి	రూ.100
బీరకాయ	రూ.100
వంకాయ	రూ.50
బీన్స్	రూ150
ఆలుగడ్డ	రూ.60
చౌడీకాయ	రూ.60
బెండకాయ	రూ.50
చిక్కుడు	రూ.80
బీట్‌రూట్	రూ.60
ఉల్లి	రూ.60

దడ పుట్టిస్తున్న ధరలు

కూరగాయాల ధరలు దఢ పుట్టిస్తున్నాయి. గతంలో రూ.500 తీసుకెళ్తే చేతి సంచి నిండా కనిపించేవి. ప్రస్తుతం రూ.600 నుంచి రూ.700 వెచ్చించినా వారినికి సరిపడా కూరగాయలు తెచ్చుకోలేని పరిస్థితి. ధరలు అదుపులో ఉన్నప్పుడు కిలో చొప్పున తీసుకెళ్లే కూరగాయలు.. ప్రస్తుతం పావుకిలో చొప్పున నాలుగు రకాల కూరగాయలు తీసుకున్నా రూ. 100కుపైనే అవుతోంది. అధికారులు కాస్త క్షేత్రస్థాయిలో పరిశీలించి ధరల అదుపునకు చర్యలు చేపట్టాలి.

– మంజుల, గృహిణి, రాయదుర్గం

భక్తిశ్రద్ధలతో బక్రీద్ జరుపుకోవాలి



మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: మత సామరస్యానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య తెలిపారు. ఆదివారం ఆయన ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఈద్గా మైదానంలో ముస్లింలు స్నేహభావంతో పండుగను జరుపుకోవాలన్నారు. అల్లా సూచించిన సన్మార్గంలో ముస్లింలు నడుచుకోవాలన్నారు. తోటి వారి పట్ల ప్రేమ, స్నేహంతో మెలగాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రజలపై అల్లా ఆశీస్సులు ఉండాలి



వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

వజ్రకరూరు: ప్రజలందరిపై అల్లా ఆశీస్సులు ఉండాలని, ముస్లింలు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్సీ, ప్రివిలైజ్ కమిటీ చైర్మన్ వై.శివరామిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు ఉరవకొండ నియోజకవర్గంలోని ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని కోరారు. కుర్బానీ ఇచ్చే ముస్లింలకు ఎంతో పుణ్యఫలం లభిస్తుందని తెలిపారు.

నీలగిరి స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో నీలగిరి స్వామి

వజ్రకరూరు: స్థానిక కురుబవీధిలోని నీలగిరి స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు ఆకుపూజ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాల వినియోగం, విశేష పూజలు చేశారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు వచ్చి పూజలు చేశారు.

ప్రతి కుటుంబానికీ అండగా ఉంటాం



కంబదూరులో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

- మాజీ ఎంపీ తలారి రంగయ్య

కంబదూరు: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాలేదన్న బాధ..వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాలేదన్న వేదనతో కుమిలిపోయి గుండెపోటుతో మృతిచెందిన బాధిత కుటుంబాలను మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య పరామర్శించారు. ఆదివారం మండలంలోని జెక్కిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డే ఈరన్న, కంబదూరు ఎస్సీ కాలనీకి చెందిన బడిగి శంకరప్ప కుటుంబాలను రంగయ్య పరామర్శించారు. జగనన్న సీఎం కాలేదన్న విషయాన్ని జీర్ణించుకోలేక వడ్డే ఈరన్న, బడిగి శంకరప్ప ఇటీవల గుండె పోటుతో మృతి చెందారు. మృతుల కుటుంబాలకు అండగా నిలబడాలన్న ఉద్దేశంతో మాజీ ఎంపీ తలారి రంగయ్య బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసి మనోధైర్యాన్ని నింపారు. బాధిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, మండల కన్వీనర్ బాలరాజు, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, సీనియర్ నాయకులు తిమ్మరాయుడు, పరందామరెడ్డి, చందన శివాజీ, సర్పంచ్ హరినాథ్, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా కార్యదర్శి విల్సన్, ఫయాజ్, రాజు, దాదు, బేల్దారి హనుమంతరాయుడు, పవన్, మల్లేష్, గోపి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవ కరపత్రాల విడుదల



అంతర్జాతీయ యోగా దినోత్సవం కరపత్రాలను విడుదల చేస్తున్న అర్బన్ సీఐ, ఆయూర్ ప్రతినిధులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో యోగా దినోత్సవ కరపత్రాలను అసోసియేషన్ ఆఫ్ యోగా (ఆయూర్) ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్ సమక్షంలో ఉరవకొండ అర్బన్ సీఐ సురేష్‌బాబు విడుదల చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆయూర్ ఆధ్వర్యంలో పదో అంతర్జాతీయ దినోత్సవాన్ని ఈనెల 21న నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగా విశిష్టతను ఉరవకొండ ప్రాంతంలో పనిచేసిన ఆయూర్‌కు దక్కుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా 19న లయన్స్ క్లబ్‌లో యోగా పోటీలు, 20న ఉదయం 6 గంటల నుంచి 7గంటల వరకు ఉరవకొండ పోలీసు గ్రౌండ్స్ నుంచి పురవీధుల గుండా సైకిల్ ర్యాలీ, 21న సామూహిక యోగా సాధన, అదే రోజు షిర్డీ సాయి కళ్యాణ మండపంలో యోగా పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

కాలుష్యం అరికట్టకపోతే ఫ్యాక్టరీని ముట్టడిస్తాం



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు

బొమ్మనహాళ్: నేమకల్లు, హిర్దేహాళ్ గ్రామాల పరిధిలో ఉన్న స్పాంజ్ ఐరన్ కర్మాగారాల నుంచి వచ్చే కాలుష్యాన్ని అరికట్టేందుకు రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ తాలుకా కార్యదర్శి నాగార్జున, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సర్మాస్, తాలుకా ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, తాలుకా కార్యదర్శి గురుస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద రైతులతో మాట్లాడారు. స్పాంజ్ ఫ్యాక్టరీల సమీపంలో పొలాల్లో సాగు చేసిన పంటలకు కర్మాగార యజమాన్యం తక్షణమే పరిహారం చెల్లించాలన్నారు. కర్మాగార కాలుష్యం వల్ల సమీపంలోని పంటలు దెబ్బతిని రైతులు ఏటా నష్టపోతున్నారన్నారు. యాజమాన్యం స్పందించి రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గౌస్, ప్రశాంత్, అనుమేష్, రైతులు గోవిందప్ప, బసన్న, తిప్పేష్, నాగప్ప, హనుమంతు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆముదం సాగుకు ఆసక్తి



ఆముదం విత్తనాలు విత్తుతున్న మహిళా రైతులు

ఆత్మకూరు: ఇటీవల విస్తృతంగా కురిసిన వర్షాలకు పంటలు సాగు చేసేందుకు రైతులకు పదును లభించింది. ఇప్పటికే పొలాల్లో దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో 12 వేల హెక్టార్లకు పైగా వేరుశనగ సాగైనట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఆముదం, కంది పంటల సాగుకు రైతన్నలు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. మరికొంత మంది రైతులు వేరుశనగ విత్తడానికి పొలాలను చదును చేసుకుంటున్నారు. ఆత్మకూరు మండల వ్యాప్తంగా 5 వేల ఎకరాలకు పైగా ఆముదం, 4 వేల ఎకరాల వరకూ కంది పంట సాగయ్యే అవకాశం ఉంది.

భక్తిశ్రద్ధలతో అఖండ గాయత్రీ హోమం



హోమం చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: వేదమాత గాయత్రీ దేవి జయంతిని పురస్కరించుకుని స్థానిక అశోక్ నగర్‌లోని హరిహరదేవాలయంలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ గాయత్రీ హోమం భక్తిశ్రద్ధలతో జరిగింది. మూడు వందల మంది భక్తులు వేర్వేరు చోట్ల ఏర్పాటు చేసిన హోమ గుండాల వద్ద పవిత్ర గాయత్రీ దేవి మంత్రం జపిస్తూ నెయ్యితో హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు మాట్లాడుతూ.. విజయతారక మంత్రంగా భాసిల్లుతున్న గాయత్రి మంత్రాన్ని విశ్వామిత్రుడు లోకానికి అందించాడని లోకకల్యాణం ఆ పవిత్ర మంత్రంతోనే ప్రాప్తిస్తుందన్నారు. అందరూ సుభిక్షంగా ఉండాలన్న ఉద్దేశంతో 12 గంటల అఖండ గాయత్రి హోమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళా మండలి సభ్యులు, కోలాట బృందం వారు భక్తి గీతాలతో అమ్మవారికి నీరాజనాలర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అంబటి ఫణిరాజ్, శ్రీధర్, సందీప్, విజయ్‌కుమార్, కాశీ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

తాత్విక చింతనకు ప్రతిరూపం ‘ఆకాశగానం’



ఆకాశగానం నవలను ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

అనంతపురం కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి నవయువకుడిగా ఉన్నప్పుడు చేసిన రచన తాత్విక చింతనతో అద్భుతంగా వచ్చిందని డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత డాక్టర్ శాంతినారాయణ, మధుర కవి మల్లెల నరసింహమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో బండి నారాయస్వామి రచించిన ఆకాశగానం నవలావిష్కరణ జరిగింది. జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సాహితీ కార్యక్రమానికి మల్లెల నరసింహమూర్తి అధ్యక్షత వహించారు. అన్వీక్షికి ప్రచురణ కర్త మహి బెజవాడ పుస్తక సమీక్షకుడిగా గుంటూరు లక్ష్మీనరసయ్య ఆత్మీయ అతిథులుగా విచ్చేసి బండి నారాయణస్వామి రచనా విశిష్టతను వివరించారు. నవలలోని అస్థిత్వవాద సిద్ధాంత రూపాలను ఆవిష్కరించిన తీరు ఎంతో గొప్ప ఉందని కొనియాడారు. ప్రాచ్య, పాశ్చాత్య తాత్విక చింతన రీతులు, నవలకు వాటితో గల సంబంధాలను విశ్లేషించారు. అదేవిధంగా జిరసం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ జన్నే ఆనంద్, కొత్తపల్లి సురేష్, డాక్టర్ అంకే శ్రీనివాస్, ఉప్పరపాటి వెంకటేశులు, రాయుడు, డాక్టర్ భీమసేనాచార్ నవల గురించి అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ రచయితలు తరిమెల అమరనాథరెడ్డి, నబీరసూల్, షరీఫ్, రియాజుద్దీన్, చిలుకూరి దీవెన, టీవీరెడ్డి, వన్నప్ప, నాగేంద్ర, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్తికేయుడికి విశేష పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు, మంజునాథుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామి మూలవిరాట్‌ను బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆకుపూజ అనంతరం స్వామి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేశారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీనివాసుడికి 108 కేజీల చక్కెరతో అభిషేకం



పూజలందుకున్న శ్రీలక్ష్మీ సమేత శ్రీనివాసుడు



పూజల్లో పాల్గొన్న మహిళలు



చక్కెరతో అభిషేకం చేస్తున్న అర్చకులు

- మార్మోగిన విష్ణుసహస్ర నామం

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం విష్ణు సహస్ర నామంతో ప్రతిధ్వనించింది. భీష్మ ఏకాదశి రోజున ప్రారంభమైన సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు వేడుకల్లో లక్ష్మీ సమేత శ్రీనివాసుడికి విష్ణు సహస్రనామ పారాయణ మండలి వారు వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులతో కలిసి 108 కేజీల చక్కెరతో అభిషేం చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు స్వామి వారి చక్కెర నైవేద్యాన్ని ప్రసాదంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అర్చకుడు హరికిషోర్ శర్మ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 17 పర్యాయాలు విష్ణు సహస్రనామ పారాయణం ఆలయంలో జరిగిందన్నారు. ముగింపు ఉత్సవంలో శ్రీవారికి విశేష చక్కెరతో అభిషేకం, సామూహిక అర్చనలు, ప్రత్యేక ఫలపుష్పాలతో అలంకార సేవలు జరిగాయని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా ఆలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విష్ణు సహస్రనామ పారాయణ మండలి ప్రతినిధులు మేడా వేంకటేశ్వరులు, శ్రీరామమూర్తి, రమేష్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్‌లతో హోరెత్తించిన చిన్నారులు



పాటకు డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: గ్రామీణ ప్రాంతాల వారి జీవన శైలిని అనుకరిస్తూ చిన్నారులు ప్రదర్శించిన కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆదివారం రాత్రి స్థానిక కృష్ణకళామందిరంలో రామ్ డ్యాన్స్ అకాడమీ వారి వేసవి శిక్షణ ముగింపు వేడుకలు జరిగాయి. డ్యాన్స్ మాస్టర్లు రవికుమార్, రమణ నేతృత్వంలో చిన్నారులు భరతమాత, గ్రామదేవత రూపాలతో పల్లెల ప్రాధాన్యత తెలిపే ఆటపాటలతో అలరించారు. అలాగే జానపద, వెస్ట్రన్ డ్యాన్సులతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆత్మీయ అతిథిగా విచ్చేసిన సీనియర్ చిత్రకారుడు, డ్యాన్స్ మాస్టర్ కత్తి విజయ్‌కుమార్‌ను సత్కరించారు. అనంతరం చిన్నారులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ అకాడమీల డ్యాన్స్ మాస్టర్లు చందు, విష్ణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.